**సమస్యలుంటే సాక్షికి చెప్పండి**

మీ సమస్యలు, ప్రయోజనాల సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**90324 97123**

నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### ఉచిత భోజనాల పంపిణీ



రోగులు, వారి సహాయకులకు భోజనాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

**మహారాణిపేట :** ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు మట్టపల్లి అనిష్, లలిత ఆధ్వర్యంలో ఉచిత భోజనాల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. శ్రీ స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో భోజనాలు తయారు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రోగులు, వారి సహాయకులకు భోజనాలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. సంస్థ అధ్యక్షుడు అప్పారావు మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి దూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులు వారి సహాయకులకు భోజనాలు అందించడం మంచి పరిణామమన్నారు.

### ప్రసన్న వేంకటేశ్వరునికి లక్ష చామంతుల పుష్పార్చన

**అక్కిరెడ్డిపాలెం :** ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరునికి లక్ష చామంతుల పుష్పార్చన నిర్వహించారు. 108 మంది మహిళలు పుష్పార్చనలో పాల్గొన్నారు. పరిసర ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని పూజలను తిలకించారు. ఆలయ ఈవో జగన్నాథం, పాలక మండలి సభ్యుడు బొడ్డేటి అచ్చిలినాయుడు, ఎక్స్ అఫిషియో మెంబర్ నారాయణాచార్యులు, అర్చకులు లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న సీఐ శ్రీనివాసరావు, యువతీ యువకులు

**ఉక్కునగరం :** స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం 5 కిలోమీటర్ల వాక్‌థాన్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. స్టీల్ రన్నర్స్ ఆధ్వర్యంలో 'సేఫ్ డ్రైవ్ – సేవ్ ది లైఫ్' నినాదంతో ఏర్పాటు చేసిన పరుగును స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. యువత ముందుండి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తెలుగు తల్లి కూడలి నుంచి కూర్మన్నపాలెం ఆర్చి వరకు వెళ్లి వెనక్కి వచ్చేలా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఐ కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో కూర్మన్నపాలెం, వడ్లపూడి, అగనంపూడి, సీఐఎస్ఎఫ్, టౌన్‌షిప్‌కు చెందిన ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ సందడి

- ఉరకలెత్తిన ఉత్సాహం
- వేడుక జరుపుకున్న యువత



27వ వార్డులో కేక్ కట్ చేస్తున్న జాన్ వేస్లీ



కోలా గురువులుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నీలకంఠం తదితరులు



న్యూ ఇయర్ వేడుకలకు కేకులు సిద్ధం



జీవీఎంసీలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులు తదితరులు



అల్లిపురంలో ముగ్గులేస్తున్న చిన్నారులు



వేడుకల సందర్భంగా అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఫ్రూట్స్



నూతన సంవత్సర ఉత్సవాలకు సిద్ధంగా పూల బొకేలు

**దాబాగార్డెన్స్ :** నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. నియోజకవర్గ పరిధి గల్లీగల్లీలో హ్యాపీ న్యూ ఇయర్ సందడి నెలకొంది. మహిళలు ఇళ్ల ముందు పాత సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ.. హ్యాపీ న్యూ ఇయర్–2024కి స్వాగతం పలుకుతూ వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. రంగు రంగుల ముగ్గులు వేసి.. వాటిపై చెమ్కీలు అద్ది అందంగా అలంకరించారు. రాత్రి 9 గంటల నుంచే న్యూయర్ సందడి నెలకొంది. రోడ్లపై యువకులు కేరింతలు కొడుతూ బైక్ డ్రైవ్ చేస్తూ ఎంజాయ్ చేశారు. రాత్రి 11 నుంచి కొత్త సంవత్సరం రాక కోసం ఎదురు చూశారు. సరిగ్గా 12 గంటలకు న్యూ ఇయర్‌ను ఆహ్వానిస్తూ పెద్ద ఎత్తున కేరింతలు కొడుతూ రోడ్లపై పరుగులు తీశారు. ప్రతి ఒక్కరికి న్యూ ఇయర్ విషెస్ చెబుతూ సందడి చేశారు.

**కేక్‌లకు గిరాకీ..**

న్యూ ఇయర్ సందర్భంగా బేకరీ దుకాణదారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన న్యూ ఇయర్ కేక్‌లను విరివిగా విక్రయించారు. కేజీ కేక్‌ను రూ.400 నుంచి రూ.500, ఐస్‌కేక్‌ను రూ.600 నుంచి రూ.700.. ఇలా విక్రయించారు. కేక్‌లు కొనుగోలు చేసేందుకు నగర ప్రజలు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. పలు చోట్ల కేకులు దొరక్క ఇబ్బంది పడ్డారు.

**మద్యం దుకాణాల వద్ద..**

మద్యం దుకాణాల వద్ద మందుబాబుల హడావుడి కనిపించింది. మద్యం కోసం పలు దుకాణాల వద్ద మందుప్రియులు క్యూలైన్‌లో వేచి మరీ మద్యం కొనుగోలు చేశారు. న్యూ ఇయర్‌ను ఎంజాయి చేశారు.

**'కోలా'కు నూతన సంవత్సర శుభాకాంక్షలు**

**అల్లిపురం :** వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులకు 33,34,35,41 వార్డుల మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేటి ప్రసాద్, కణితి బ్రహ్మం, కొడమంచిలి శ్రీను, పిల్లి శివ, రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం ప్రధాన కార్యదర్శి బొడ్డు పోలారావు స్వయంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2024లో అతని ఆధ్వర్యంలో విజయం సాధించాలని, మరిన్ని ఉత్తమ పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

**సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో..**

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, జీవీఎంసీ ఎంప్లాయిస్ గౌరవాధ్యక్షులు ఆనందరావు సమక్షంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ కిరణ్‌కుమార్, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, జిల్లా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీవీ అశోక్‌కుమార్, జనరల్ సెక్రటరీ అనిమిరెడ్డి రమణ, రియాజ్, కర్రి రాజేష్, నాగేశ్వరరావు, మురళి, రాజు, నవీన్ తదితరులు పాల్గొని ఆనందరావుతో కలిసి కేక్ కట్ చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

**రంగువల్లులతో స్వాగతం..**

ఆదివారం రాత్రి కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా చిన్నారులు, యువతులు ఇళ్ల ముందు అందమైన రంగువల్లులతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. మగవారంతా అర్ధ రాత్రి 12 గంటల వరకు పాటలతో సందడి చేసి, కేక్‌లు కట్ చేసి ఆంగ్ల సంవత్సరాదికి స్వాగతం పలికారు. చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వీధులన్నీ రంగవల్లులతో హరివిల్లులను తలపించాయి.

**27వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..**

**సీతమ్మధార :** జీవీఎంసీ 27వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. 2023కు వీడ్కోలు పలుకుతూ నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వేస్లీ హాజరై కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పద్మనాభం అమ్మాజీ, మధురెడ్డి, బాబు, భాస్కర్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, రాజా, అంగటి కుమారి, మల్లేశ్వరి, టికేటి లక్ష్మి, శైలజ, జయలక్ష్మి, శ్రావణి, పాలికల వీర్రాజు, యేసు తదితరులు పాల్గొన్నారు.

# కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సిరులతల్లి



అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



ఆకట్టుకున్న మహిళల కోలాటం

**దాబాగార్డెన్స్ :** మార్గశిర మాసోత్సవాల 18వ రోజు ఆదివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంట ల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ, క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు.

**జగన్నాథస్వామి ఆలయంలో అన్నదానం..**

ఆదివారం మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో కె.శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వెలమల సంక్షేమమే ధ్యేయం



తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు

**సీతమ్మధార:** వెలమల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని ఉత్తరాంధ్ర వెలమ సంక్షేమ సేవా సంఘం కమిటీ తీర్మానించింది. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని కార్యాలయంలో ఆదివారం సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు ప్రవేశపెట్టిన తీర్మానాలను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉత్తరాంధ్ర వెలమల సెంట్రల్ ఆర్గనైజేషన్ వినతి మేరకు వెలమల సామాజిక భవనం నిర్మాణానికి నగరంలో 75 సెంట్ల స్థలం కేటాయించేందుకు అనుమతి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత ఉత్తరాంధ్ర వెలమ సామాజిక భవనం అభివృద్ధి, మరమ్మతుల నిమత్తం ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలని నిర్ణయించారు. దూర ప్రాంతం నుంచి వచ్చే వెలమ సామాజిక వర్గం వారికి, నిరుద్యోగులు, ఉద్యోగులకు అతి తక్కువ రుసుంతో వసతి కల్పించాలని తీర్మానించారు. సెంట్రల్ ఆర్గనైజేషన్ భవన మరమ్మతులకు అల్లు శంకరరావు విరాళం ప్రకటించారు. సంఘ అభివృద్ధి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని చెప్పారు. సంఘం అభివృద్ధికి సహకరిస్తున్న పెద్దలు, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు చొక్కాకుల వెంకటరావు, రొంగలి జగన్నాథం, సంఘం అధ్యక్షుడు చుక్క చినబాబు, కార్యదర్శి బండారు రామకృష్ణ, మిడతాన బాపు నాయుడు, చిరికి కొండల రావు, కె.వెంకట రావు, తమటపు కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ



నిరసన తెలుపుతూ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

**సీతమ్మధార :** సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సర్వసతీ పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ, మున్సిపల్, సర్వశిక్ష అభియాన్ కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. వారి దీర్ఘకాల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర నాయకులతో ముఖ్యమంత్రి చర్చలు జరపాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఎం.మన్మథరావు, కె.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.